ఖమ్మం ఓఆర్ఆర్‌కు కొత్త అలైన్‌మెంట్

- నేషనల్ హైవే అథారిటీ ఆమోదం
- కలెక్టరేట్‌కు సమీపం నుంచి రోడ్డు
- త్వరలో పనులు చేపట్టేందుకు రాష్ట్ర సర్కారు సన్నాహాలు

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): ప్రతిపాదిత ఖమ్మం ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) అలైన్‌మెంటు మారింది. తనికెళ్ల మీదుగా కాకుండా బల్లేపల్లి, ఖానాపురం హవేలీ మీదుగా నిర్మించాలని నిర్ణయించారు. ఈ కొత్త అలైన్‌మెంట్ వల్ల కలెక్టరేట్‌కు ఎటువంటి ముప్పు ఏర్పడే అవకాశం లేదు. కలెక్టరేట్ కాంపౌండ్‌వాల్‌కు దాదాపు 550 మీటర్ల దూరం నుంచి దీనిని నిర్మించనున్నారు. దీంతో కలెక్టరేట్ ఓఆర్ఆర్ వెలుపల ఉండనున్నది. దీనివల్ల రోడ్డు పొడవు మూడు కిలోమీటర్లు తగ్గుతున్నది. దీనికి జాతీయ రహదారుల అథారిటీ ఆమోదం తెలిపింది.

ఖమ్మం చుట్టూ జాతీయ రహదారులు

రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా జిల్లా కేంద్రాలకు కూడా ఓఆర్ఆర్‌లను నిర్మించాలని గతంలోనే కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. ఖమ్మం నగరం చుట్టూ నాలుగు లేన్ల ఓఆర్ఆర్‌ను ప్రతిపాదించారు. ఇప్పటికే ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణం వెలుపల నుంచి మూడు వైపులా జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతున్నది. ముఖ్యంగా నాగపూర్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవేను ఖమ్మం మీదుగా తెలంగాణ సరిహద్దు వరకు నిర్మిస్తున్నారు. దీనిని రూ.6,700 కోట్లతో ఎన్‌హెచ్ఏఐ నిర్మిస్తున్నది. సూర్యాపేట-దేవరపల్లి హైవే కూడా ఖమ్మం మీదుగా వెళ్తున్నది. దీనిని రూ. 2,213.91 కోట్లతో ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్మిస్తున్నారు. కోదాడ నుంచి ఖమ్మం వరకు మరో జాతీయ రహదారిని నిర్మిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం నుంచి కురవి వరకు మరో రహదారిని నిర్మిస్తున్నది. ఈ రోడ్లన్నీ ఖమ్మం నుంచి బైపాస్ కావడంతో నగరానికి మూడువైపులా నాలుగు లైన్ల జాతీయ రహదారులు ఏర్పడుతున్నాయి. వీటి అనుసంధానంతో ఓఆర్ఆర్ ఏర్పాటవుతుంది. రోడ్ల అనుసంధానంలో భాగం గా ఓఆర్ఆర్‌ను కొత్త కలెక్టరేట్ వెలుపలి నుంచి తనికెళ్లకు సమీపంలోని విజయ ఇంజినీరింగ్ కాలేజ్ మీదుగా నిర్మించాలని గతంలో ప్రతిపాదించారు. దీనికి బదులు అంతకుముందు ప్రతిపాదించిన బల్లేపల్లి, ఖానాపురం హవేలీ మీదుగా నిర్మించాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

కేసీఆర్‌ను పరామర్శించిన నరసింహన్

- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన మాజీ గవర్నర్

ఆదివారం బంజారాహిల్స్‌లోని నివాసంలో బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావును పరామర్శిస్తున్న మాజీ గవర్నర్ నరసింహన్ దంపతులు. చిత్రంలో కేసీఆర్ సతీమణి శోభ

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తెలంగాణ మాజీ గవర్నర్ నరసింహన్ పరామర్శించారు. ఆదివారం జూబ్లీహిల్స్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి సతీసమేతంగా వచ్చారు. ఇటీవల తుంటి ఎముక ఆపరేషన్ అయిన నేపథ్యంలో కేసీఆర్ ఆరోగ్యం గురించి నరసింహన్ దంపతులు అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా కోలుకోవాలని నరసింహన్ ఆకాంక్షించారు. కేసీఆర్, శోభమ్మతో కొద్దిసేపు ముచ్చటించారు. కేసీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. గవర్నర్ హోదాలో నాడు నరసింహన్ అందించిన సంపూర్ణ సహకారం కూడా మరిచిపోలేమని, ఈ సందర్భంగా నాటి పరిస్థితులను గుర్తుచేసుకున్న కేసీఆర్.. నరసింహన్‌కు మరోసారి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహన్ దంపతులను కేసీఆర్ కుటుంబం పట్టువస్త్రాలతో సత్కరించింది. అంతకుముందు మాజీ గవర్నర్ దంపతులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, ఎంపీలు బీబీ పాటిల్, సంతోష్‌కుమార్ తదితరులు స్వాగతం పలికారు. కేసీఆర్ క్రమంగా కోలుకుంటున్నారని బీఆర్ఎస్ ఎన్నారై కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల పేర్కొన్నారు. కొన్ని రోజులుగా నందినగర్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారని, ఆయన యోగక్షేమాల గురించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎన్నారైలు అడిగి తెలుసుకుంటున్నారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అజ్మీర్ దర్గాకు కేసీఆర్ చాదర్

కేసీఆర్ ఏటా పంపించినట్టే ఈసారి కూడా ఉర్స్ షరీఫ్ సందర్భంగా అజ్మీర్ దర్గాకు చాదర్ పంపించారు. మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, బీఆర్ఎస్ నేత ఆజమ్ అలీ తదితర ముస్లిం పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

లీడర్ ఈజ్ బ్యాక్

కేసీఆర్ ఫొటోతో ఎక్స్ ఖాతాలో ఎంపీ సంతోష్ పోస్ట్

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): 'ద లీడర్ ఈజ్ బ్యాక్.. అండ్ రెడీ టూ మేక్ వేవ్స్' అంటూ రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ ఆదివారం ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిస్థాయిలో కోలుకుంటున్నారని, ఆయన మళ్లీ తన కార్యక్షేత్రంలోకి రాబోతున్నారంటూ సంతోష్ చేసిన పోస్ట్ పార్టీలో వైరల్‌గా మారింది. కేసీఆర్ చాలా రోజుల తర్వాత తానంతట తాను కుర్చీలో కూర్చున్న తాజా ఫొటోను జత చేశారు. నాయకుడు కోలుకుంటున్నారని, ప్రజాక్షేత్రంలోకి రాబోతున్నారన్న సందేశం ఇచ్చేలా ఈ పోస్ట్ ఉన్నది.

పులుల ఆధిపత్య పోరు

- కాగజ్‌నగర్ పరిధిలో తొలిసారి ఆడపులి మృతి
- మహారాష్ట్ర చంద్రాపూర్‌లో 7 పులుల మృత్యువాత

- నువ్వా.. నేనా? కుమ్రం పులి

దరిగాం అటవీ ప్రాంతంలో మృతిచెందిన పులిని పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

హైదరాబాద్, జనవరి 7 (నమస్తేతెలంగాణ): అభయారణ్యంలో పులుల సంఖ్య పెరిగితే ఆధిపత్య పోరు తప్పదన్న హెచ్చరికలు నిజమవుతున్నాయి. తమ ప్రాంతంలోకి కొత్తవాటి రాకను సహించలేక పోవడంతో వాటి మధ్య బీకర పోరుకు దారితీస్తున్నది. ఈ దాడుల్లో పులులు మృత్యువాత పడుతున్నాయి. తాజాగా మన రాష్ట్రంలోని కుమ్రంభీం ఆసిపాబాద్ జిల్లా కాగజ్‌నగర్ అటవీ కారిడార్ పరిధిలోని మహారాష్ట్ర సరిహద్దులోని దరిగాం అటవీ ప్రాంతంలో తొలి సారి మరో పులితో జరిగిన బీకర పోరులో ఓ ఆడ పులి తనువు చాలించింది. మహారాష్ట్ర సరిహద్దు నుంచి వలస పులులు వస్తుండగా, కాగజ్‌నగర్ కారిడార్‌లో ఉన్న పులులు ఆధిపత్యం కోసం వాటి రాకను ఒప్పుకోవడం లేదని తేలింది. ఆ దాడిలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరు సలుపుతాయని రుజువైంది. పులి తమ సామ్రాజ్యాన్ని కాపాడుకునేందుకు ఆధిపత్య పోరు సలిపి తమ జాతి వర్గాన్నే అంతం చేసుకుంటున్నది.

తొలి టెరిటోరియల్ టైగర్ డెత్

మహారాష్ట్ర చంద్రాపూర్ జిల్లా మాలిని అటవీ ప్రాంతం సమీపంలోని గోంది-కుమ్రంభీం జిల్లా కాగజ్‌నగర్ దరిగాం అటవీ ప్రాంతం మధ్య కుమ్రంభీం ప్రాజెక్ట్ కాలువ సమీపంలో రెండు ఆడ పులులు భీకరంగా తలపడగా, ఒక ఆడ పులి మృతి చెందినట్టు నిర్ధారించార్ధారు. శనివారం ఓ పశువుల కాపరి ఆ ప్రాంతానికి వెళ్లగా పులి మృతి చెంది ఉన్నట్టు గుర్తించి, అటవీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. దీనిని కాగజ్‌నగర్ అడవుల్లో తొలి టెరిటోరియల్ టైగర్ డెత్‌గా గుర్తించామని డీఎస్‌వో తెలిపారు.

45 రోజుల్లో 10 పులుల మృత్యువాత

తెలంగాణలోని కుమ్రంభీం జిల్లా, మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా సరిహద్దులోని సుమారు 60 కిలోమీటర్ల పరిధిలోని అటవీ ప్రాంతం పరిధిలో 45 రోజుల వ్యవధిలో 10కి పైగా పులులు మృతిచెందిన ఘటనలు కలవరపెడుతున్నాయి. ఆధిపత్య పోరులోనే 7 పులులు చనిపోయాయని అటవీ అధికారులు చెప్తున్నారు. నిరుడు నవంబర్ 14న చంద్రాపూర్ జిల్లా చీమూరు అటవీ ప్రాంతంలో రెండు పులుల మధ్య జరిగిన పోరులో ఓ పులి మృతి చెందింది. నవంబర్ 18న తడోబాలో మరో పులి కన్నుమూసింది. డిసెంబరు 10న వరోరా అటవీ రేంజ్‌లో ప్రమాదంలో ఓ పులి చనిపోగా, డిసెంబరు 14న పలాస్‌గావ్‌లో ఇంకో పులి సహజంగా చనిపోయింది. డిసెంబర్ 21న సిందేవాహి రేంజ్‌లో విద్యుదాఘాతంతో ఓ పులి మృతిచెందింది.

దరిగాం అడవిలో పులి మృతిపై విచారణ

కాగజ్‌నగర్, జనవరి 7: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దరిగాం అటవీ ప్రాంతంలో పులి మృతిపై అటవీశాఖ అధికారులు ఆదివారం విచారణ జరిపారు. సీసీఎఫ్ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి ఆనవాళ్లను పరిశీలించారు. అనంతరం కాగజ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఒకటిన్న రేండ్లలోపు, రెండేండ్లు దాటిన ఆడ పులుల మధ్య ఆవాసం కోసం ఘర్షణ జరిగి ఉండవచ్చని తెలిపారు. ఈ ఘర్షణలో ఒకటిన్నరేండ్లలోపున్న పులి కాలు, మెడ, శరీరంపై బలమైన గాయాలతో తీవ్ర రక్తస్రావమై మృతి చెంది ఉంటుందని పేర్కొన్నారు. పులిపై ఎలాంటి విష ప్రయోగం, వేటాడిన ఆనవాళ్లు కానీ లేవని ప్రాథమికంగా నిర్ధారించారు. పశువైద్యులు విజయ్‌కుమార్, శ్రీకాంత్ పంచనామా నిర్వహించి శాంపిళ్లను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు.

ఇథనాల్ పరిశ్రమతో నష్టాలే ఎక్కువ

- నిజనిర్ధారణ కమిటీ సభ్యుడు ధర్మార్జున్

దిలావర్‌పూర్, జనవరి 7: ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుతో లాభాలకంటే నష్టాలే ఎక్కువగా ఉన్నాయని నిజనిర్ధారణ కమిటీ సభ్యులు ధర్మార్జున్ అన్నారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామంలో ఇథనాల్ పరిశ్రమపై రైతులకు టీజేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మార్జున్ మాట్లాడుతూ.. ఇథనాల్ పరిశ్రమతో రైతులకు ప్రయోజనం లేదని చెప్పారు. కంపెనీ చెప్పే వాస్తవాలకంటే అసత్యాలే ఎక్కువగా ఉన్నాయని విమర్శించారు. చిత్తనూరులో కూడా రైతులను మభ్యపెట్టి ఈ పరిశ్రమ ఏర్పాటు చేశారని ఆరోపించారు. దేశంలో 200 పరిశ్రమలకు అనుమతినిచ్చిందని తెలిపారు.

- మాజీ ఎమ్మెల్యే ఆలకు హరీశ్‌రావు పరామర్శ

ఇటీవల గుండెపోటుతో మరణించిన దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడు శశివర్ధన్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు - భూత్పూర్

మా 'ఊపిరి' తీయొద్దు!

- ఆటో డ్రైవర్లను శత్రువులుగా చూడొద్దు
- మా ఆకలి పోరాటం అర్థం చేసుకోండి
- నెలకు రూ.15వేల భృతి ఇవ్వండి
- ఆటోల్లోనూ ఫ్రీ జర్నీ స్కీం పెట్టండి
- ఆర్టీసీలాగే ఆటోవాలాలను ఆదుకోండి
- ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ కుటుంబాలకు అండగా నిలువండి
- లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం
- టీఏటీయూ నాయకుల హెచ్చరిక
- ధర్నాచౌక్‌లో ఆటో డ్రైవర్ల మహాధర్నా

ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సతీశ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆటో డ్రైవర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో/కవాడిగూడ, జనవరి 7 (నమస్తే తెలంగాణ): 'మేమేం పాపం చేశాం.. సీఎంగారూ మా ఉపిరి తీయొద్దు.. మమ్మల్ని శత్రువులుగా చూడొద్దు.. మాకూ అండగా నిలువండి' అంటూ రేవంత్ రెడ్డిని ఆటో డ్రైవర్లు వేడుకున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధి కోల్పోయామని, ప్రభుత్వం తమ గోడు వినాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో తెలంగాణ ఆటో మోటార్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ (టీఏటీయూ) ఆధ్వర్యంలో 'చలో హైదరాబాద్-మహాధర్నా' నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఏటీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య మాట్లాడుతూ.. 'సీఎం రేవంత్‌రెడ్డి.. మా ఆటో డ్రైవర్లను శత్రువులుగా చూస్తున్నారు. ఎవరి మీద ఆధారపడకుండా మా ఉపాధి మేమే చూసుకొని ఆటో నడుపుకుంటున్నాం. మాకు ఉద్యోగాలు ఇప్పించండని మేం ఏనాడు ఏ ప్రభుత్వాన్ని కోరలేదు. మా బతుకేదో మేం బతికాం. కానీ మేం నమ్మిన మా ఆటోని లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం సరైనది కాదు. ఇప్పటికే మా ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు' అని ఆవేదన వ్యక్తంచేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆనాడు ఉమ్మడి పాలకుల అనాగరిక విధానాలతో తెలంగాణ బిడ్డలు తమ ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని.. ఇప్పుడు అవే విధానాలను అనుసరిస్తున్న రేవంత్‌రెడ్డి పాలనలో కూడా మళ్లీ ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఆర్టీసీకి ప్రభుత్వం డబ్బులు ఎలాగైతే చెల్లిస్తుందో.. అలాగే ఆటోలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి, ఆటో డ్రైవర్లకు కూడా డబ్బులు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.15 వేల భృతి ఇవ్వాలని, ఆటో డ్రైవర్ల పోరాటాన్ని రాజకీయంగా చూడొద్దని..ఆకలి పోరాటంగా చూడాలని కోరారు.

ఆటో డ్రైవర్ సతీశ్‌ది ప్రభుత్వ హత్యే!: బీఆర్‌టీయూ అధ్యక్షుడు

సోమాజిగూడకు చెందిన ఆటో డ్రైవర్ సతీశ్ ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ డిమాండ్ చేశారు. తక్షణమే సతీశ్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. 'సతీశ్‌గౌడ్ వాళ్ల నాన్న ఆటో డ్రైవర్. అతడు ఆటో నడిపి కుటుంబాన్ని పోషించేవాడు. తండ్రి మరణించాక ఆటో వృత్తిని సతీశ్‌గౌడ్ కొనసాగించి కుటుంబానికి పెద్ద దిక్కయ్యాడు. తమ్ముళ్లు, చెల్లి, అమ్మను చూసుకుంటున్నాడు. చెల్లె పెండ్లి చేశాడు. ఆ కుటుంబం అంతా ఆటో మీదనే ఆధారపడింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్కసారిగా అతడి ఆశలన్నీ అడియాశలయ్యాయి. ఉచిత బస్సు స్కీంతో ఆటోలకు గిరాకీ లేదు. కుటుంబాన్ని పోషించే మార్గం లేక మనస్తాపం చెంది ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు' అంటూ గద్గద స్వరంతో వివరించారు. సతీశ్ గాథను విన్న అక్కడి ఆటో డ్రైవర్లంతా కన్నీటి పర్యంతమయ్యారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసుల కళ్లు కూడా చెమ్మగిల్లాయి. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ రూప్‌సింగ్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకోవద్దని పిలుపునిచ్చారు. కొట్లాడి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆటో డ్రైవర్ల సమస్యను ప్రభుత్వం రాజకీయంగా చూడటం సిగ్గు చేటని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల గురించి ఒక్క మాట కూడా మాట్లాడేందుకు సీఎం రేవంత్‌రెడ్డికి సమయం లేదా? అని ప్రశ్నించారు. అనంతరం మృతుడు ఆటో డ్రైవర్ సతీశ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కనీస వేతన బోర్డు మాజీ చైర్మన్ పీ నారాయణ, టీఏటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్, హైదరాబాద్ టీఏటీయూ అధ్యక్షుడు నిరంజన్ పాల్గొన్నారు.

అవకాశమిస్తే ఆకాశమే హద్దు

- 'ఫిక్కీ లేడీస్' బిజినెస్ అవార్డు ప్రదానోత్సవంలో మంత్రి సీతక్క

సుల్తాన్‌బజార్, జనవరి 7: అవకాశమిస్తే ఆకాశమే హద్దుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదివారం కోఠిలోని మహిళా వర్సిటీ దర్బార్ హాల్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్వో), వైఎఫ్ఎల్‌వో సంయుక్తంగా వివిధ వ్యాపార రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న 24 మంది మహిళలకు బిజినెస్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. దీనికి మంత్రి ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క, నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎఫ్ఎల్‌వో మాజీ జాతీయ అధ్యక్షురాలు పింకీరెడ్డి, ఎఫ్ఎల్‌వో చైర్మన్ రీతూషా, వైఎఫ్ఎల్‌వో ఆర్తీషా హాజరయ్యారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎం విజ్జుల్లత, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, తెలంగాణ అడిషనల్ డైరెక్టర్ జనరల్ అభిలాష బిష్త్ తదితరులు అవార్డులు అందుకున్నారు.

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేనకు అవార్డు అందజేస్తున్న మంత్రి సీతక్క

గుండెపోటుతో కేయూ ఉద్యోగి మృతి

- 20 లక్షల బకాయిలపై ఆందోళన

హనుమకొండ చౌరస్తా, జనవరి 7: గుండెపోటుతో కేయూ ఉద్యోగి మృతి చెందాడు. కాకతీయ విశ్వవిద్యాలయ అధికారులు చేసిన పనికి బిల్లులు చెల్లించకపోవడంతో మానసికంగా మనోవేదనకు గురై మృతి చెందాడని బంధువులు ఆరోపించారు. కేయూ హిస్టరీ, టూరిజం విభాగంలో లమ్సమ్ ఉద్యోగిగా పని చేస్తున్న కాలె మధుసూదన్ (49) వర్సిటీ ఐడీ కార్డులు, ఫ్లెక్సీలు, నేమ్ ప్లేట్స్, బోర్డులు, ప్రింటింగ్‌కు సంబంధించిన రామెటీరియల్స్ తీసుకువచ్చి ఇంటి వద్ద పనిచేస్తుంటాడు. గతంలో న్యాక్ బృందం పర్యటన సందర్భంగా న్యాక్ పర్చేజింగ్ కమిటీ చైర్మన్, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ మంచాల సదానందం రూ.20 లక్షల విలువైన పనులు చేయించారు. ఆ బిల్లులు చెల్లించలేదు. పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయింది. దీంతో ఒత్తిడికి గురై ఆదివారం గుండెనొప్పితో మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మృతదేహాన్ని కేయూ పరిపాలనా భవనం ఎదుట ఉంచి నిరసన తెలిపారు. సోమవారంలోగా డబ్బులు చెల్లిస్తామని వీసీ రమేశ్ హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని తీసుకెళ్లారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలివ్వాలి

- మ్యానిఫెస్టో హామీని నెరవేర్చాలి
- త్వరలోనే సీఎంను కలుస్తాం
- టీయూడబ్ల్యూజే 143 (టీజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ

టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న అల్లం నారాయణ

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని టీయూడబ్ల్యూజే 143 (టీజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లోని యూనియన్ కార్యాలయ స్థలంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చించాలని తీర్మానించారు. యూనియన్ ఆఫీసుకు స్థలం కేటాయించిన గత కేసీఆర్ ప్రభుత్వానికి రాష్ట్ర కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్ర ప్రభుత్వానికి యూనియన్ పక్షాన అభినందనలు తెలుపుతూ.. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన జర్నలిస్టు సంక్షేమ అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి వాటి సాధనకు కృషి చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆరోగ్య భద్రతకు రూ.10 లక్షల హెల్త్ కార్డు ఇవ్వాలని, నగదు రహిత హెల్త్ కార్డులు చలామణి అయ్యేలా చూడాలని విజ్ఞప్తిచేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఫిబ్రవరి 29లోపు నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేయాలని సంఘం నేతలకు సూచించారు. మార్చిలో రాష్ట్ర మహాసభ ఉంటుందని వెల్లడించారు. యూనియన్ కార్యాలయ నిర్మాణం కోసం ట్రస్ట్‌ను ఏర్పాటు చేసుకుందామన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారు తీసాగర్, ఉపాధ్యక్షులు రమేశ్ హజారే, బీఆర్ లెనిన్, అబ్దుల్లా, ఆదినారాయణ, తెమ్జు ప్రధాన కార్యదర్శి రమణకుమార్, ఐజేయూ జాతీయ కార్యదర్శి రాజమౌళి చారి, కార్యవర్గ సభ్యులు అవ్వారీ భాస్కర్ పాల్గొన్నారు.

తెమ్జు రాష్ట్ర అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి

తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ (తెమ్జు) రాష్ట్ర అధ్యక్షుడిగా ఏ విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆయన ఇప్పటి వరకు ఉమ్మడి మెదక్ జిల్లా టీయూడబ్ల్యూజే నేతగా కొనసాగారు. హైదరాబాద్ అధ్యక్షుడిగా ఉన్న పీ యోగానందం యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికయ్యారు.

హస్తినాపురంలో మాంగళ్య షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న ప్రముఖ సినీ నటి రాశిఖన్నా

మాంగళ్య మాల్‌ను ప్రారంభించిన రాశిఖన్నా

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని హస్తినాపురం (బీఎన్‌రెడ్డి నగర్ నాగార్జునసాగర్ రోడ్డు)లో కొత్తగా ఏర్పాటుచేసిన మాంగళ్య షాపింగ్ మాల్‌ను ప్రముఖ సినీ నటి రాశిఖన్నా ఆదివారం ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి ఇది 18వ స్టోర్ అని మాల్ చైర్మన్ కాసం నమఃశ్శివాయ తెలిపారు. రాశిఖన్నాను చూసేందుకు అభిమానులు పెద్దసంఖ్యలో చేరుకోవడంతో అక్కడ సందడి నెలకొన్నది. కార్యక్రమంలో మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం మల్లికార్జున్, కాసం నమఃశ్శివాయ, కాసం కేదారి, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్, కాసం ప్రణీత్, తోను పూనూరి కార్తిక్ అరుణ్, పుల్లూరు వరుణ్ విశాల్ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దుచేయాలి: పీఆర్టీయూ తెలంగాణ

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : సీపీఎస్‌ను రద్దుచేసి పాత పింఛన్ హామీని నిలబెట్టుకోవాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. జీవో -317 ద్వారా నష్టపోయిన టీచర్లను సొంత జిల్లాలకు బదిలీ చేయాలని, స్పౌజ్ బదిలీలను వచ్చే వేసవిలో చేపట్టాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం చెన్నయ్య, ప్రధానకార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పర్యవేక్షణ పేరుతో ఎస్సీఈఆర్టీలో తిష్టవేసిన వారిని తిరిగి పాఠశాలలకు పంపించి, సబ్జెక్టు టీచర్ల కొరతలేకుండా చూడాలని కోరారు. టెట్‌తో సంబంధం లేకుండా మల్టీ జోన్ -2లో మిలిగిపోయిన పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.